క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంటోన్మెంట్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 8.30 వరకు అక్షయ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలోని కూరగాయల మార్కెట్ ప్రాంతం. ఉదయం 10 గంటల నుంచి 10.30 వరకు రామ్‌రాజ్ నగర్ ఫీడర్ పరిధిలోని ఎండీఎఫ్ రోడ్, శంకర్ ఎన్‌క్లేవ్, సమతానగర్ ప్రాంతాలు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సత్య ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలోని సత్యసాయి ఎన్‌క్లేవ్, టెక్ కాలనీ, ఇంద్రానగర్, ఎల్‌బీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

పాటిగడ్డ, జమిస్తాన్‌పూర్ పరిధిలో..

రాంగోపాల్‌పేట్: పాటిగడ్డ, జమిస్తాన్‌పూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు.. సంజీవయ్యపార్కు, యోగిబీర్, హనుమాన్ టెంపుల్ ప్రాంతాలు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 వరకు బుద్ధభవన్ ఏరియా. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు.. అంబేడ్కర్‌నగర్, డబుల్ బెడ్రూమ్, జస్తా హోటల్, మోక్ష హోటల్, సుందరం మోటర్స్, హనుమాన్ టెంపుల్ ప్రాంతాలు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు.. మధురానగర్, ఎస్ఆర్ హాస్పిట్, సంజీవపురం, శ్రీనివాస్ నగర్. మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు.. ఎంసీహెచ్ పార్కు ఫీడర్ పరిధిలోని బలరాం కాంపౌండ్, సంధ్య హోటల్, హెరిటేజ్ ఏరియా ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్ల వంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరిబీర 45, క్యాబేజీ 10, క్యారెట్ 21, దొండ 23, గుండుబీన్స్ 35, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 28, దోసకాయ 28, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 22, చామగడ్డ 60, మొరంగడ్డ 28, కందగడ్డ 25, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

మంచిరేవులకు బస్సు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ నుంచి మంచిరేవుల వరకు నూతనంగా బస్సు సదుపాయాన్ని కల్పించినట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సీహెచ్. వెంకన్న ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్, ప్యారడైజ్, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, మణికొండ, నార్సింగ్ మీదుగా మంచిరేవులకు 47 వై/హెచ్ బస్సు నడపనున్నట్లు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు బయలు దేరుతుందన్నారు.

హుండీ ఆదాయం రూ.6 లక్షలు

రాంగోపాల్‌పేట్: శివాజీనగర్‌లోని పెరుమాల్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం హుండీని లెక్కించగా రూ.6,01,281 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. లెక్కింపులో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కృష్ణ, ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, ఈవో సత్యమూర్తి, మాజీ ధర్మకర్తలు కసిరెడ్డి నరేందర్ పాల్గొన్నారు.

నేడు బోయిన్‌పల్లికి పుష్పగిరి శంకరాచార్య రాక

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి భావనా కాలనీలోని గణేశ్ దేవాలయ 25వ వార్షికోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. రెండో రోజైన సోమవారం గణేశ్ ఉపనిషత్ హవనం, అష్టోత్తర శత కలశాభిషేకం, ప్రదోషపూజ, భవన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం నిర్వహించనున్న బలిదానం, పూర్ణాహుతి కార్యక్రమాలకు జగద్గురు పుష్పగిరి శంకరాచార్య హాజరై పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి

లిబర్టీ: టూరిజం అభివృద్ధి సంస్థలో అనేక ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి టూరిజం కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం సమర్పించింది. తాము ఎదుర్కొంటున్న సమస్యలను యూనియన్ ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి ప్రధాన కార్యదర్శికి వివరించారు. రాష్ట్రంలోని 33 జిల్లాలో టూరిజం అభివృద్ధి సంస్థలో వివిధ విభాగాల్లో 25 సంవత్సరాలుగా పని చేస్తున్నప్పటికి కనీస వేతనాలు లేక ఉద్యోగాలు పర్మినెంట్ కాక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారన్నారు. ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని సీఎస్ భరోసా ఇచ్చారన్నారు.

గూడు చెదిరె.. గోడు మిగిలె!

కాచిబోలిలో వీడని టెన్షన్

- మున్నూరు కాపు భవనంలోనే 15 ఇళ్ల వాసులు
- మినిస్టర్‌రోడ్‌లో పాక్షికంగా తెరుచుకున్న దుకాణాలు
- ఆందోళనలో వ్యాపారులు


కాచిబోలి బస్తీలోని ఇళ్లలోకి రానివ్వకుండా ఏర్పాటు చేసిన డేంజర్ టేప్

రాంగోపాల్‌పేట్: మినిస్టర్ రోడ్‌లోని రాధా ఆర్కేడ్‌లో ఈ నెల 19న జరిగిన అగ్ని ప్రమాదం ఘటనతో ఈ ప్రాంతం ఇంకా కోలుకోలేదు. ఘటన జరిగి ఐదు రోజులు అవుతున్నా భవనంలో చిక్కుకుని పోయారని భావిస్తున్న మరో ఇద్దరి ఆచూకీ తెలియకపోవడం, ఆరంతస్తుల భవనం పటిష్టతపై అనుమానాలు వ్యక్తమవుతుండంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రమాదం జరిగిన రాధా ఆర్కేడ్ భవనాన్ని ఆనుకుని కాచిబోలి బస్తీ ఉంది. భారీ ఎత్తున అగ్ని ప్రమాదం జరగడంతో గంటల తరబడి వేడితో పక్కనున్న బస్తీలోని 15 ఇళ్లకు ఇబ్బంది ఏర్పడింది. ఇళ్లలోకి మంటలు రావడం, కొంత సామగ్రి పాడవడం, దట్టమైన పొగలతో బస్తీ ప్రజలు అనారోగ్యాలకు గురయ్యారు. దీంతో ప్రభుత్వం బస్తీ వాసులను మున్నూరు కాపు సంఘం భవనంలోకి తరలించింది. 15 ఇళ్ల వారిని అందులోకి వెళ్లడం ప్రమాదకరమని అధికారులు హెచ్చరించారు. దీంతో బస్తీ వాసులకు స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్, ప్రభుత్వం భోజనాలు ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ ఒక్కో ఇంటికి రూ.10వేల చొప్పున సొంత ఆర్థిక సహాయం అందించారు. కానీ ఐదు రోజులు అవుతున్నా ఇంకా బస్తీలోని ఇళ్లలోకి ప్రజలను అనుమతించకపోవడం, పిల్లా పాపలతో దూరంగా ఉంటుండటంతో వారిలో ఆందోళనకు మొదలయింది.

అందరూ దినసరి కూలీలే..

వెనుక వైపు ఉండే భవనం ఎప్పుడు కూలిపోతుందోనన్న మరో భయం వెంటాడుతుంది. అలాగే భవనాన్ని కూల్చివేస్తామని అధికారులు చెప్పడంతో తమకు ఎలాంటి నష్టం జరుగుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు భవనాన్ని కూలగొట్టే అవకాశాలు లేకపోవడంతో ఇంకా ఎన్నాళ్లు ఇలాగే ఉండాలనే ఆందోళన వెంటాడుతుంది. అలాగే ఇక్కడ కుటుంబాలకు చెందిన వారందరు రోజు వారి పనులు చేసుకుని జీవించే వాళ్లే. ప్రమాదం జరిగినప్పటి నుంచి పనులకు దూరం కావడంతో కుటుంబం గడిచేదెలా అని వాపోతున్నారు. బస్తీతో పాటు దీనికి వెనుక వైపు ఉత్తమ్ టవర్స్‌లో కిమ్స్ ఆస్పత్రి నర్సుల హాస్టల్ ఉండగా వీరిని ఖాళీ చేయించారు. అలాగే గగన్ ప్యారడైజ్‌లో పెద్ద సంఖ్యలో కుటుంబాలు ఉంటుండగా ప్రమాదం జరిగిన భవనం ఎప్పుడు కూలుస్తారు, కూలిస్తే తమ నివాసాల సంగతేమిటని ఈ అపార్ట్‌మెంట్ వాసుల్లో టెన్షన్ మొదలయ్యింది.

దుకాణాల మూతతో లక్షల్లో నష్టం..

మినిస్టర్ రోడ్ అనగానే ఆటో మొబైల్స్, కారు యాక్సెసరీస్, హార్డ్‌వేర్ షాపులకు నెలవు. ప్రతి రోజు ఇక్కడ కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంది. గత నాలుగు రోజుల నుంచి మినిస్టర్‌రోడ్‌లోని డీవీకాలనీ రోడ్ నుంచి నల్లగుట్ట చౌరస్తా వరకు ఉండే అన్ని దుకాణాలు పోలీసులు మూసివేయించగా సోమవారం పాక్షికంగా తెరిచారు. దీంతో ఇక్కడ రోజు వారి వ్యాపారాలు నిలిచిపోవడంతో కిరాయిలు, జీతాలు ఎలా చెల్లించాలని వ్యాపారులు బెంబెలెత్తుతున్నారు. ఇంకా ఎన్ని రోజులు ఇలా ఉండాలో తెలియడం లేదని వారు ఆందోళన చెందుతున్నారు.

భయం వద్దు మేమున్నాం



ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అధికారులు శాయశక్తుల పని చేస్తున్నారు. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది. బస్తీలో వైద్య శిబిరం ఏర్పాటు చేయించడంతోపాటు భోజనాలు పెట్టిస్తున్నాం ఎవరు ఆందోళన చెందవద్దు. ప్రజలకు ఏ అవసరం ఉన్నా మేము అండగా ఉంటాం.

–కార్పొరేటర్ చీర సుచిత్ర

ఇళ్లను విడిచి ఎన్నాళ్లిలా..



ఇళ్లకు తాళాలు వేసి పిల్లపాపలతో ఇంకా ఎన్నాళ్లు ఇలా దూరంగా ఉండాలి. ఈ ప్రమాదంతో వచ్చిన మంటలతో ఇళ్లకు నష్టం జరిగింది. ఆ భవనం కూల్చివేస్తే మరెంత నష్టం జరుగుతుందోనని భయం వేస్తుంది. మా ఇళ్లకు నష్టం జరుగకుండా తొందరగా ఆ భవనాన్ని కూల్చివేయాలి. – రేణుక

అనారోగ్యానికి గురయ్యాం..



ప్రమాదం జరిగిన రోజు వచ్చిన దట్టమైన పొగలతో గొంతు నొప్పి తదితర సమస్యలతో అనారోగ్యం బారిన పడ్డాం. ఇక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేసినా ఇంకా పొగలు వస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇళ్లకు దూరంగా పనులకు పోకుండా ఉండటంతో ఇళ్లు ఎలా గడవాలో తెలియడం లేదు. – సవిత

రోజుకి రూ.15 వేల ఖర్చు



ప్రమాదం జరిగిన భవనం ముందే మా కార్ డెకోర్ షాపు ఉంది. నాలుగు రోజులుగా మూసివేశాం. ఒక్కో రోజు రూ.15 వేలు మెయింటెనెన్స్ ఖర్చు ఉంటుంది. నెలకు రూ. లక్షన్నర కిరాయి, ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి. వేగంగా పనులు పూర్తి చేసి భవనం కూల్చివేయాలి.

–రూపేష్ ఎస్సీ కార్ డెకోర్స్ యజమాని

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న రఘునందన్ కుమార్

రాంగోపాల్‌పేట్: విద్యార్థులు చిన్నతనం నుంచి కష్టపడి చదివి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రఘునందన్ కుమార్ సూచించారు. ఆదివారం రాత్రి జరిగిన పార్క్‌లేన్‌లోని బీఆర్‌జేసీ పార్శీ హైస్కూల్ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 1987లో రష్యా మొదటి సారిగా అంతరిక్షంలోకి ఉపగ్రహాన్ని పంపిందని, 2017లో భారత్ ఒకేసారి 104 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపించి చరిత్ర సృష్టించిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో భారతదేశ శాస్త్రవేత్తలు సొంతంగా తయారు చేసిన వ్యోమనౌకలో అంతరిక్షంలోకి వెళ్లనున్నట్లు చెప్పారు. ఆదిభట్లలోని స్పేస్ రూట్ అనే సంస్థ ఎన్నో ప్రయోగాలను చేస్తుందన్నారు. అంతకు ముందు పాఠశాల కార్యదర్శి ఆశిష్ చినాయ్, ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ చారి, ట్రస్టీలు నాధిర్ చినాయ్, సామ్ చినాయ్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వాలన చేశారు. ఈ కార్యక్రమంలో పీఈటీ రత్నాకర్, పీఆర్వో సత్యనారాయణ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో వేళలు పాటించండి


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమ

చిలకలగూడ: జలమండలి శ్రీనివాసనగర్ సెక్షన్ పరిధిలో మంచినీటి సరఫరాలో వేళలు పాటించాలని కార్పొరేటర్ సామల హేమ ఆదేశించారు. సోమవారం ఆమె జలమండలి, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శ్రీనివాసనగర్, ఫ్రైడే మార్కెట్, ఉప్పరిబస్తీ, షాబాద్‌గూడ ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాలో వేళలు పాటించకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని, పారిశుద్ధ్య లోపంతో ఇబ్బందులు పడుతున్నామని ఈ సందర్భంగా స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆమె సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట జలమండలి సెక్షన్ మేనేజర్ నవ్య, ఇంజనీరింగ్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఫిబ్రవరి 17న పరేడ్ గ్రౌండ్‌లో బహిరంగ సభ


మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్యే సాయన్నతో స్థానిక నేతలు

కంటోన్మెంట్: వచ్చేనెల 17న కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని పరేడ్ గ్రౌండ్‌లో బీఆర్ఎస్ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే సాయన్న తెలిపారు. సోమవారం సభ అనుమతి కోసం జిల్లా పార్టీ అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్‌తో కలిసి స్టేషన్ కమాండర్‌ను కలిసి దరఖాస్తు చేశారు. అనంతరం కార్ఖానాలోని తన క్యాంపు కార్యాలయంలో సభ నిర్వహణ, ఏర్పాట్లపై చర్చించారు. కంటోన్మెంట్ ప్రాంతం జీహెచ్ఎంసీ విలీనానికి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతున్న క్రమంలోనే పార్టీ బహిరంగ సభను ఇక్కడ నిర్వహించడం శుభపరిణామం అన్నారు. కంటోన్మెంట్‌లో సివిలియన్ ప్రాంతాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోకి వస్తే అభివృద్ధి వేగంగా పుంజుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతోనే కంటోన్మెంట్ ప్రజలకు మేలు కలిగే అవకాశం ఏర్పడుతోందన్నారు. బీఆర్ఎస్ పార్టీ పేరు ఖరారైన తర్వాత నగరంలో జరిగే తొలి బహిరంగ సభను విజయవంతం చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు నివేదిత, టీఎన్ శ్రీనివాస్, పనస సంతోష్, సదానంద్ గౌడ్, తేజ్‌పాల్ సత్యానంద్, దేవులపల్లి శ్రీనివాస్, నిత్యానంద్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం పరిశీలన

రాంగోపాల్‌పేట్: మినిస్టర్‌రోడ్‌లోని కాచిబోలిలో బస్తీ వాసుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సోమవారం కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బస్తీవాసులకు అవసరమైన వైద్య సేవలు కొనసాగించాలని సూచించారు. ఎలాంటి అనారోగ్యం ఉన్నా వైద్యం చేయించుకుని ఉచితంగా మందులు పొందాలన్నారు.

మర్యాదపూర్వక కలయిక

బౌద్ధనగర్: ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఆయన నివాసంలో బౌద్ధనగర్‌కు చెందిన బీజేపీ నాయకులు రవిప్రసాద్ గౌడ్, జైహింద్ గౌడ్, శ్యామ్, నవీన్, లాల్ బహదూర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

రాత పరీక్షతో సివిల్ సర్వీస్ అకాడమీకి ఎంపిక

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ నూతనంగా ఏర్పాటు చేసిన సివిల్ సర్వీస్ అకాడమీకి రాత పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు డైరెక్టర్ ప్రొ.గణేష్ తెలిపారు. క్యాంపస్ కాలేజీలతో పాటు అనుబంధ నిజాం, సికింద్రాబాద్, సైఫాబాద్ పీజీ, కోఠి మహిళా కాలేజీల డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు రాత పరీక్షలో వచ్చిన మెరిట్ ద్వారా సాధించిన 100 మంది అభ్యర్థులను సివిల్ సర్వీస్ అకాడమీలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. త్వరలో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు వెల్లడించారు.

మాంజాకు చిక్కుకున్న గద్ద

కాపాడిన ఫైర్ సిబ్బంది



సనత్‌నగర్: మాంజాకు చిక్కుకుని విలవిల లాడుతున్న ఓ గద్దను సనత్‌నగర్ ఫైర్ సిబ్బంది కాపాడారు. సనత్‌నగర్ అల్లావుద్దీన్ కోఠిలోని చెట్ల కొమ్మలపై వాలిన గద్ద అక్కడి మాంజాకు చిక్కుకుని అరుస్తుండగా స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ ప్రదీప్ ఆధ్వర్యంలో అక్కడికి చేరుకుని దాదాపు గంట పాటు రెస్క్యూ చేసి గద్ద ప్రాణాలను కాపాడారు.

'కంటి వెలుగు'కు స్పందన



అమీర్‌పేట: ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని అమీర్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ రేవతి తెలిపారు.అమీర్‌పేట క్లస్టర్ పరిధిలో 5 కేంద్రాలు పని చేస్తున్నాయని, రోజూ 120– 150 మంది వరకు వస్తున్నారన్నారు. కాలనీ, బస్తీ అసోసియేషన్ల విజ్ఞప్తి మేరకు ఆయా చోట్ల కేంద్రాలను ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేస్తున్నట్లు వివరించారు. అవసరమైన వారికి అప్పటికప్పుడే రీడింగ్ అద్దాలు ఇస్తున్నారని ఇతర సమస్యలతో ఇబ్బందులు పడే వారిని ఆపరేషన్లకు పంపుతున్నామన్నారు. మంత్రి తలసాని ఆదేశాల మేరకు అమీర్‌పేట వివేకానంద కమ్యూనిటీ హాల్లోని కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించినట్లు మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి తెలిపారు.

నగరంలో కానరాని అభివృద్ధి: కిషన్ రెడ్డి


బాపూనగర్‌లో పాదయాత్ర చేస్తున్న కిషన్‌రెడ్డి

అమీర్‌పేట: మహానగరంలోని ప్రజా సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం అమీర్‌పేట డివిజన్ బాపూనగర్‌లో సోమవారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. బాపూనగర్, ఎస్ఆర్‌టీ, బల్కంపేటలో పాదయాత్ర చేస్తూ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.నగరంలో ప్రజా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆదాయం వస్తున్నా నిధులను పక్కదోవ పట్టిస్తున్న కారణంగా జీహెచ్ఎంసీ, జలమండలి విభాగంలో అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. కార్పొరేటర్ కేతినేని సరళ, నాయకులు శ్యామ్‌సుందర్‌గౌడ్, పురుషోత్తమ్‌రెడ్డి, సారంగపాణి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్ సమగ్రాభివృద్ధే లక్ష్యం


భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న రామకృష్ణ

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ప్రాంత సమగ్రాభివృద్ధే బీజేపీ లక్ష్యమని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. కంటోన్మెంట్ ఆరోవార్డు సిఖ్ విలేజ్‌లో రూ.14 లక్షల బోర్డు నిధులతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులకు సోమవారం ఆయన స్థానిక నేతలు బానుక మల్లికార్జున్, బాణాల శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేసి మాట్లాడారు. కంటోన్మెంట్ పరిధిలోని 90 శాతం ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల సదుపాయం కల్పించామన్నారు. త్వరలో మిగతా ప్రాంతాల్లోనూ పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ ప్రజలకు సరిపడా నీటిని అందించడం లేదన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు కూడా తగిన సహకారం అందించడం లేదని ఆరోపించారు. నటేశ్, అచ్యుత్, అన్వర్, రమేశ్ పాల్గొన్నారు.

బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం


విజయం సాధించిన కుర్మ బలరాం, సత్యనారాయణ

బన్సీలాల్‌పేట్: బీజేఆర్ నగర్ బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కుర్మ బలరాం, సత్యనారాయణ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ బీజేఆర్ నగర్ బస్తీ ఎన్నికల్లో ఇరువురు విజయం సాధించారు. హోరాహోరీగా జరిగిన ఎన్నికలో అధ్యక్ష పదవికి పోటీ చేసిన కుర్మ బలరాంకు 173 ఓట్లు, ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన సత్యనారాయణ(సత్తి) 281ఓట్లతో విజయం సాధించారు. అధ్యక్ష పదవికి పోటీ పడిన సీపీ శంకర్(32), దేశపాక గోవర్ధన్(28), కొడారి నర్సింగ్‌రావు(83), ఓ. రాజు(19), జి. నర్సింగ్‌రావుకు(75) ఓట్లు వచ్చాయి. ఎన్నికల నిర్వహణ కమిటీ ప్రతినిధులు రాగటి సత్యం మాదిగ, ఎం. వెంకన్న, బి. మహేష్, కొడారి రాజు, సురేష్ ఫలితాలను వెల్లడించి ఈ నూతన కమిటీ మూడు సంవత్సరాల పాటు అధికారంలో ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కుర్మ బలరాం, సత్యనారాయణ మాట్లాడుతూ.. బస్తీ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో ముందుకు సాగుతామన్నారు. కుర్మ బలరాం వరుసగా మూడుసార్లు బస్తీ ఎన్నికల్లో విజయంతో హ్యాట్రిక్ సాధించారు.

అభినందనలు



ఉస్మానియా యూనివర్సిటీ: మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఇటీవల జరిగిన జాతీయ సదస్సులో పాల్గొని బెస్ట్ రీసెర్చ్ పేపర్, బెస్ట్ ప్రజెంటస్ అవార్డులను సాధించిన ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎకనామిక్స్ విభాగం విద్యార్థిని స్వాతిని వీసీ ప్రొ.రవీందర్ అభినందించారు. పీడీఎస్‌యూ నేతగా విద్యార్థి సమస్యల పై పోరాడుతూనే చదవులోనూ ముందున్న స్వాతిని ఎకనామిక్స్ అధ్యాపకులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, సుమంత్, వెంకటేష్ పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి పురస్కరించుకుని సోమవారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లోని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లిలో నిర్వహించిన జయంతి వేడుకలో బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి నివాళి అర్పించారు. వారాసిగూడ చౌరస్తాలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి నివాళులర్పించారు. ఆయా డివిజన్లలో కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు సుభాష్‌చంద్రబోస్‌కు నివాళి అర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

– సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం


సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి


నేతాజీకి నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక, కాంగ్రెస్ నాయకులు


నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన


సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి, గజ్జెల నాగేశ్


సుభాష్ చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్‌ల అలవాటు పడి పాలైన ఓ యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అల్వాల్ వెంకటాపురంకు చెందిన బి.మోహన కృష్ణ (24) టీసీఎస్ కంపెనీలో సిస్టమ్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. గత కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడి తెలిసిన వాళ్లందరి వద్ద అప్పులు చేశాడు. అప్పులు తీర్చేమార్గం లేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. సోమవారం బొల్లారం–అల్వాల్ రైల్వేస్టేషన్ల మధ్యలోని క్రాసింగ్ వద్ద ఆత్మహత్య చేసుకున్నాడు.